

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి - కడప అర్బన్

రక్తదానంతో ఒకరికి ప్రాణాన్ని నిలబెట్టిన వారవుతారని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని శాంతి సేవా సొసైటీ సభ్యులు మడగలం మనోహర్ తెలిపారు. శనివారం సర్వజన ఆస్పత్రిలో ఆరికె నగరకు చెందిన ఈశ్వరమ్మ అనే మహిళకు, శాంతి సేవా సొసైటీ సభ్యులు కేడీ బాబు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ బంధుమిత్రులు లేని వారికి శాంతి సేవా సొసైటీ సభ్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులు చేయాల్సిన రక్తదానం సొసైటీ సభ్యులు చేస్తున్నారని చెప్పారు. సహాయం పొందిన వారు, సొసైటీ చేస్తున్న సేవలు ఉపయోగకరమైతే తమ సొసైటీలో సభ్యులుగా కొనసాగాలని పిలుపునిచ్చారు.

దుమ్ము, ధూళితో
సూపర్‌స్పెషాల్టీ!

- మట్టిరోడ్డులో రోగుల అవస్థలు
- నిత్యం వందలాది మందికి నరకం
- కలెక్టర్ గారూ..కాస్త పట్టించుకోరూ!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రి పరిధిలోని సూపర్ స్పెషాలిటీ విభాగం దుమ్ము, ధూళితో నిండిపోతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట అప్పటి ప్రభుత్వం సుమారు రూ.374 కోట్లతో సూపర్ స్పెషాలిటీ, కేన్సర్, సైక్రియాటిక్ విభాగాలను ప్రారంభించిన సంగతి తెలిసిందే. వీటికి జిజిహెచ్ ప్రవేశ, నిష్క్రమణ భాగాల నుంచి అందమైన తారురోడ్డు నిర్మించారు. ఐపి విభాగం వెనుకభాగం నుంచి సూపర్‌స్పెషాలిటీకి వెళ్లే దారిని నిర్మించడం విస్మరించడం దుమ్మూధూళికి నిలయంగా మారింది. ప్రతిరోజూ జిజిహెచ్‌లోని ఐపి, ఒపి విభాగాలకు సుమారు 1,600 మంది రోగులు వస్తుంటారు. వీరిలో ఐపి, ఒపి విభాగాలకు వచ్చిన వందలాది మంది రోగులు స్పెషలిస్టు వైద్యసేవల నిమిత్తం వెనుకభాగంలోని మట్టిరోడ్డు మీదుగా వెళ్తున్నారు. ప్రతి రోజూ సూపర్‌స్పెషాటీకి 160 మంది, కేన్సర్ విభాగానికి 120 మంది, సైక్రియాటిక్ విభాగానికి 60 మంది వరకు రోగుల్లో అత్యధికులు మట్టి రోడ్డుపైనే వెళుంటారు. వర్షాకాలంలో బురదగుంటల మధ్య, వేసవిలో మండు టెండలకుతోడు



బలమైన గాలుల నేపథ్యంలో మట్టిరోడ్డు మీదుగా సుడిగాలుల నడుమ వెళ్లాల్సి వస్తోంది. ఐపి విభాగం సమీపంలో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయడంతో నిత్యం వందలాది పార్కింగ్ వాహనాలు వెళ్తున్నాయి. పలితంగా మట్టిరోడ్డు నుంచి చెగలరేగుతున్న దుమ్మూదూళి సూపర్‌స్పెషాలిటీ విభాగాన్ని ముంచెత్తుతోంది. జిజిహెచ్ ఆస్పత్రి వెనుకభాగంలోని గోడలు, కిటికీల నుంచి దుమ్మూధూళి సూపర్‌స్పెషాలిటీలోకి చేరుతోంది. హాస్పిటల్ డెవలప్‌మెంట్ అధికాటీ చైర్మన్ హోదా కలిగిన కలెక్టర్ హెచ్‌డిఎస్, సిఎస్ఆర్, డిఎంఎఫ్ వంటి నిధుల సహాయంతో తారు రహదారి నిర్మాణానికి చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు రోగులు కోరుతున్నారు.

పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలి

- డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు

ప్రజాశక్తి - కడప

ఈనెల 16, 17 తేదీలలో నిర్వహించబోయే ఎపిపిఎస్‌సి ఫారెస్ట్ రేంజ్, జూనియర్ అసిస్టెంట్ ఇన్ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి సంబంధించి నిర్వహించే పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై శనివారం తన ఛాంబర్‌లో పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారులైన పర్యవేక్షకులు ఎం.డి. బాబర్, ఏ.శివ నారాయణ రెడ్డి, లైజన్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లాలోని 6 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు మధ్యాహ్నం 12:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు పరీక్షలుంటాయన్నారు. పరీక్షా కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా చూడాలని చెప్పారు. అభ్యర్థులు వారి వెంట వచ్చే వారికి ఎలాంటి కొరత లేకుండా ఆయా పరీక్ష కేంద్రాల యాజమాన్యాలు అన్ని వసతులను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని చింతకొమ్మదిన్నె మండల పరిధిలో 04, చాపాడు మండల పరిధిలో 01, ప్రొద్దుటూరు పట్టణ పరిధిలో 01 పరీక్షా కేంద్రంతో కలిపి మొత్తం 6 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ, సెక్షన్ ఆఫీసర్లు, ఎపిపిఎస్‌సి లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కడప

వక్ఫ్ సవరణ బిల్లు ఉపసంహరించాలని ఇండియా కూటమి నాయకులు పేర్కొన్నారు. శనివారం వారు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ అంటే దైవార్పితమైన ఆస్తి, రాజులు,నవాబులు, ధనవంతులు వక్ఫ్ కోసం భూములు ఆస్తులు వందల సంవత్సరాలుగా దానంగా ఇస్తున్నారని చెప్పారు. వక్ఫ్ ఆస్తుల ఆదాయాన్ని విద్యాసంస్థలు, శ్మశానవాటికలు, మసీదులు, అనాథ శరణాలయాలు తదితర వాటి నిర్వహణకు వినియోగిస్తారు అన్నారు. ఇది ముస్లిం మైనారిటీలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. 1954లో కాంగ్రెస్ పార్టీవక్ఫ్ చట్టాన్ని తీసుకువచ్చి బోర్డు ఏర్పాటు చేసిందని చెప్పారు. ఆర్మీ, రైల్వేల తర్వాత ఎక్కువ భూములు ఉన్నది వక్ఫ్ బోర్డుకే అని తెలిపారు. ఇప్పటికీ బిజెపి ప్రభుత్వం పౌరసత్వ చట్టం, ఉమ్మడి పౌరస్మృతి, ట్రిపుల్ తలాక్, కాశ్మీరులో ముస్లిములకు ఉపయోగపడే ఆర్టికల్ 370 రద్దు లాంటి చట్టాలు చేసింది అన్నారు. ఇప్పుడు సవరణ బిల్లు ద్వారా ముస్లిములను ఆర్థికంగా బలహీనపరచడమే లక్ష్యంగా పెట్టుకుంది అన్నారు. ఈ బిల్లు పూర్తిగా మత స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి అన్నారు. అదానీ, అంబానీ లాంటి వారికి దారాదత్తం చేయడం కోసమే అన్నారు. ఈ బిల్లు విషయంలో టిడిపి, వైఎస్ఆర్‌సిపి, జనసేన పార్టీలు తమ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలన్నారు నేడు వక్ఫ్, రేపు గురుద్వారాలు, చర్చీల ఆస్తులు, తరువాత దేవాదాయ ధర్మాదాయ శాఖ భూములు కార్పొరేట్ల వశం చేయటానికే ప్రభుత్వాలు యత్నిస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే జిల్లాలోనూ, రాష్ట్రంలోను, దేశంలోనూ, వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని వాపోయారు. వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎపిసిసిసి కో-ఆర్డినేటర్ ఎస్.ఎ. సత్తార్, నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్, కడప అసెంబ్లీ నియోజకవర్గం కో- ఆర్డినేటర్ బండి జకరయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శిగాలి చంద్ర, సిపిఐ (ఎం ఎల్) జిల్లా కన్వీనర్-బండెల ఓబయ్య, ఆప్ జిల్లా ఇన్‌ఛార్జి డాక్టర్ శ్రీనివాసులు, బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి గురప్ప, రెవెల్యూషనరి సోషలిస్ట్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు సిరాజుద్దీన్, హమీద్, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

కట్టడాలను తొలగించడం బాధాకరం : డిసిసి

ప్రజాశక్తి-కాశినాయన



కూల్చిన భవనాన్ని పరిశీలిస్తున్న విజయజ్యోతి

మండలంలోని జ్యోతి క్షేత్రంలో కాశినాయన భక్తుల కోసం నిర్మించిన భవనాలను అటవీశాఖ అధికారులు కూలదోయడం చాలా బాధాకరమని దీనంతటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి పేర్కొన్నారు శనివారం ఆమె జ్యోతి క్షేత్రాన్ని సందర్శించారు అక్కడ కూలదోసిన అన్న సత్రాలను పరిశీలించారు అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కొన్ని రోజులుగా ప్రముఖ కాశిరెడ్డి నాయన జ్యోతిక్షేత్రానికి అటవీశాఖ అనుమతులు లేవని భవనాలు కూలగొట్టడం వల్ల భక్తుల మనోభావాలుఏ దెబ్బతిం టున్నాయని పేర్కొన్నారు. దీన్ని వెంటనే విరమించుకోవాలని ఆమె అన్నారు. అటవీ అధికారులు భవనాలు తొలగిస్తున్న విషయం తమకు తెలియదని అధికార పార్టీ నాయకులు చెప్పడం హేయనీయమని వాపోయారు. కార్యక్ర మంలో పిసిసి సభ్యులు డాక్టర్ అన్వర్, ఒబిసి బద్వేల్ నియోజకవర్గ చైర్మన్ గురప్ప, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు బాష, ముజాహిద్, అష్రఫ్ అలీ, సుమేర్ పాల్గొన్నారు.

ఆలయానికి ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి - కడప



ఫ్యాన్లు అందజేస్తున్న మురళీమోహన్

కడప కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ప్రాంతీయ అధికారి కె. మురళీ మోహన్ ఆధ్వర్యంలో శనివారం దేవుని కడప ఆలయం సమీప ంలోని సోమేశ్వర శివాలయానికి ఫ్యాన్లు, నీటి డిస్పెన్సర్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఆలయానికి వచ్చే ప్రజలకు చల్లదనం కల్పించేందుకు వితరణ చేశామని పేర్కొన్నారు. బ్యాంకు ద్వారా సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉంద న్నారు. కార్యక్రమంలో డిఎం ఎస్.రమేష్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అసెంబ్లీలో మత విద్వేష ప్రసంగం తగదు

ప్రజాశక్తి - కడప : రాష్ట్ర శాసనసభలో ఇటీవల భారతీయ జనతా పార్టీ ఆదోని శాసనసభ్యుడు పార్థసారథి వాల్మీకి మతవిద్వేష ప్రసంగం చేశారని, ఆయనపై అనర్హత వేటు వేయాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ లేఖను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయచోటిలో ఇటీవల వీరభద్రేశ్వర స్వామి పార్వేట ఉత్సవం సందర్భంగా చోటు చేసుకున్న గొడవల్లో మసీదు నుంచి వచ్చిన అల్లరి మూకలు దాడి చేశారంటూ పదే పదే ముస్లిములను ఉద్దేశించి దురుద్దేశపూర్వకంగా మాట్లాడటం దారుణమని అభ్యంతరం తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా బాధ్యత కలిగిన శాసనసభ్యుడిగా మతవిద్వేష వ్యాఖ్యలు చేయ డం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మతం, కులం పేరిట భారతీయ జనతా పార్టీ దేశమంతా చేస్తున్న అసాంఘిక, శాసన, చట్ట ఉల్లంఘన కార్యక లాపాలు రాష్ట్రంలో కూడా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు అర్థమవు తోందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఒబిసి జిల్లా అధ్యక్షుడు చిన్న కులయప్ప, క్రిస్టియన్ విభాగపు జిల్లా అధ్యక్షులు సంజయ్ కాంత, హమీద్, గంగయ్య, గౌరీదేవి పాల్గొన్నారు.

వేదాంత ఆస్పత్రిలో లామినార్ ఫ్లో ఒటి ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్



ఫ్లో ఒటిని ప్రారంభిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

నగరంలోని ఐటిఐ సమీపంలో నూతనంగా నిర్మించిన వేదాంత ఆస్పత్రిలో శనివారం లామినార్ ఫ్లో ఒటి ఆపరేషన్ థియేటర్‌ను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కడప నగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి నగరాలకు వెళ్లకుండా అన్ని సదుపాయాలతో అధునాతన టెక్నాలజీ ఆస్పత్రి ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ శివ శంకర్, డాక్టర్ దినేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - కడప : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వన్ టౌన్ సిఐ బి. రామకృష్ణ, కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. శనివారం కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల అలవాట్లు విద్యార్థుల బంగారు భవిష్యత్తుని నాశనం చేస్తాయని అన్నారు. గంజాయి, పొగాకు, సిగరెట్, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ అలవాట్లు మనిషి జీవితాన్ని భౌతికంగా, మానసికంగా అనారోగ్య పరుస్తాయని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని అన్నారు. ఈగల్ క్లబ్ కో-ఆర్డినేటర్లు కెప్టెన్. డాక్టర్.నీలయ్య, డాక్టర్. సావిత్రి మాట్లాడుతూ అంధకారం చేసుకోకుండా చదువుపై దృష్టి పెట్టాలన్నారు.

రసాభాసగా మండల సమావేశం

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇపై ఎంపిటిసిల ఆగ్రహం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట



ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇని నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

మండల పరిషత్ సభా భవనంలో ఎంపిపి అక్కెటి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రజాభాసగా సాగింది. అజెండా ప్రకారం మండల అధికారులు మాట్లాడాలని ఎంపిడిఒ ప్రసాద్ బాబు చెప్పారు. ముందుగా ఆర్డబ్ల్యూఎస్ ఎఇ తులసి రెడ్డి మాట్లాడుతుండగా గొల్లపల్లి సర్పంచి లక్ష్మీనారాయణరెడ్డి మండలంలో అన్ని పంచాయతీలలో నీటి సమస్య ప్రధానంగా ఉందని, ఎఇ విధులు సక్రమంగా నిర్వహించలేదని ఆరోపించారు. అందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ సరిగ్గా సమాధానం ఇవ్వక పోవడంతో కొండమాచకులు సర్పంచి శివ నారాయణ, కొంతమంది ప్రజా ప్రతినిధులు వాగ్వాదానికి దిగారు. అప్పటికీ ఆయన స్పందించకపోవడంతో సభ రసాభాసగా మారింది పోలీసులు రంగ ప్రవేశం చేశారు స్టేజీపైన ఉన్న స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, ఎంపిడిఒ ప్రసాద్‌బాబు కలుగ జేసుకుని సభలో ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వాలని ఎఇకి సూచించారు. అయినా ఏమీ మాట్లాడకపోవడంతో ఎఇపై విచారణ చేపట్టాలని గొల్లపల్లి, కొండమాసుపల్లి సర్పంచులు లక్ష్మీనారాయణ రెడ్డి, శివ నారాయణ డిమాండ్ చేశారు. కొద్దిసేపు సమావేశం గందంగోళంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం ఆరోగ్య శాఖ, ఉపాధిచట్టం, వెటర్నరీ, ఐసిడిఎస్ శాఖలకు సంబంధించిన అధికారులు ప్రసంగించారు. రెవెన్యూ అధజకారులు తమ శాఖకు సంబంధించిన విషయాలను చెప్పకపోవడంతో స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య జోక్యం చేసుకుని రెవెన్యూ సదస్సులు, ప్రజా సదస్సులు, అభివృద్ధి వాంటి వాటిపై తెలియజేయలాని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు దగ్గరలో ఉన్నాయని, పారిశుధ్య సిబ్బంది బాగా పనిచేసి ఒంటిమిట్టకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. చివరగా ఎంపిడిఒ ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఆర్‌అండ్‌బి శాఖకు సంబంధించిన ఎఇ రెండు సమావేశాలకు రాలేదని, ఆయనకు నోటీలసు ఇవ్వాలని, సర్వసభ్య సమావేశానికి అందరూ అధికారులు సక్రమంగా రావాలని లేకపోతే వారి పైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహాల పర్యవేక్షణకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - కడప అర్బన్

బోధన పరిశోధనల పరంగా బిజీగా ఉన్నప్పటికీ వసతి గృహాల పర్యవేక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని యోగివేమన విద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్యులు ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయంలోని తన ఛాంబర్‌లో శనివారం విశ్వవిద్యాలయ వసతి గృహ సంక్షేమ అధికారులతో, ప్రొఫెసర్లతో సమావేశం నిర్వహించారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లోని విద్యార్థుల కోసం ఆంగ్ల, తెలుగు దినపత్రికలు తెప్పించనున్నామన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు, సమకాలీన సంఘటనలను ఎప్పటికప్పుడూ తెలుసుకునే సౌకర్యం దినపత్రికల వల్ల కలుగుతుందన్నారు. విద్యార్థినుల కోసం తేక్వాండో రెండో దశ శిక్షణ రెండు రోజుల్లో ప్రారంభించనున్నమన్నారు. డిఎస్‌సి రాసే వారి సంఖ్యను బట్టి శిక్షణ ఇవ్వాలనే ఆలోచన కూడా చేస్తున్నామన్నారు. అందరూ అంకితభావంతో పని చేయాలని, నిత్యం పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. అనంతరం బాలికల వసతి గృహానికి వసతి గృహ సంక్షేమ అధికారులతో పాటు వెళ్లి ఆహార పదా ర్థాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆహార పదార్థాలు ఎలా ఉన్నాయని విషయంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో వసతి గృహ సంక్షేమ అధికారులు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ రామ్ మనోహర్ రెడ్డి, డాక్టర్ వర ప్రభాకర్, డాక్టర్ డి.ఆర్.సతీష్ బాబు, డాక్టర్ అను ప్రసన్న, డాక్టర్ జిల్లెల్ల మెర్సీ విజేత, ప్రజా సంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి. సరిత, డాక్టర్ టి.సురేశ్ బాబు, కార్యాలయం సిబ్బంది గాయత్రి పాల్గొన్నారు.

అంజాద్‌బాషా ఆరోపణలు అర్థరహితం

ప్రజాశక్తి - కడప అర్బన్ : డిప్యూటీ మాజీ సిఎం అంజాద్‌బాషా తనపై చేసిన ఆరోపణలు అర్థరహతమని టిడిపి 24వ డివిజన్ ఇన్‌ఛార్జి అశోకరెడ్డి అన్నారు. శనివారం రాజారెడ్డి వీధిలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర చరిత్రకు తెరలేపింది వైసిపి నాయకులే అన్నారు. అంజాద్ బాషా సోదరుడే అసాంఘిక శక్తులను పెంచి పోషించారని తెలిపారు. 'జగన్ నన్ను చూసి ఓటు వేయండి। అని అడిగారంటే అంజాద్ బాషాకు చెడ్డ పేరు ఉందనే అర్థమన్నారు. తాను ఏ తప్పు, నేరం చేయలేదని తెలిపారు. దేవిరెడ్డి ఆదిత్య తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని చెప్పారు. రౌడీ రాజకీయం చేసింది అహ్మద్ బాషానే అన్నారు. ఎమ్మెల్యే మాధవి ఇలాంటి వాటిని ప్రోత్సహించరని పేర్కొన్నారు. లేనిపోనీ ఆరోపణలు చేస్తే చట్టపరంగా వెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో బొమ్మిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజలు పన్నులను సకాలంలో చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం చివరి నెల కావడంతో ఇంటి పన్ను, నీటి పన్ను చెల్లింపులను సులభతరం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో సెలవు దినాలలో కూడా కడప మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని, నగర ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకుని పన్నులు చెల్లించాలని తెలిపారు.

విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి

- తెలంగాణ ఆరోగ్యశ్రీ సిఇఒ లోతేటి శివశంకర్
- ఘనంగా ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి కడప అర్బన్



మాట్లాడుతున్న లోతేటి శివశంకర్

విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలని తెలంగాణ ఆరోగ్యశ్రీ సిఇఒ లోతేటి శివశంకర్ పిలుపునిచ్చారు. శనివారం ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఒక్కటే సరిపోదని మానసిక వికాసం ఎంతో అవసరమన్నారు. తల్లిదండ్రులు చదువు ఒకటే పిల్లలపై రుద్దకూడదు అని హితవుపలికారు. ఉపాధ్యాయులు విద్యార్థులను దండించాలంటే నేటి పరిస్థితులలో భయపడుతున్నారని చెప్పారు. దీనివల్ల క్రమశిక్షణ తప్పుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిబంధనలకు లోబడే పౌరులు జీవించాలని పేర్కొన్నారు. శాస్త్రీయ తత్పరత, మానవీయ కోణం మనలో ఉండాలని తెలిపారు. చదువు ఉద్యోగాన్ని, సంస్కారం గౌరవాన్ని ఇస్తాయని చెప్పారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి అందులో రాణించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. కడప ఆర్‌డిఒ జాన్ ఎర్విన్ మాట్లాడుతూ ప్రస్తుతం విద్య వ్యాపారంగా మారడం ఆందోళన కలిగించే పరిణామం అన్నారు. కష్టపడితే సాధించలేనిది ఏమీ లేదని చెప్పారు. వైవీయూ డిస్టెన్స్, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విదేశాలలో విద్యావ్యవస్థ ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఎక్కువ సమయం పిల్లలతో గడపాలని తెలిపారు. పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ ప్రమోద మాట్లాడుతూ మనిషికి ఆరోగ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. వ్యాయామం తప్పనిసరిగా చేయాలని చెప్పారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎం. వివేకానంద రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు ప్రపంచ స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమశిక్షణలో పెట్టడం ఎంతో అవసరమన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో భారతీయ విజ్ఞాన్ పీఠ్, హైదరాబాద్ చైర్మన్ మనోహర్ రెడ్డి సచివాలయాల కార్యదర్శి డోల లక్ష్మి, ప్రిన్సిపల్స్ హరికృష్ణ, బిఇడి ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి సంధ్యారెడ్డి, ఓబుల్ రెడ్డి, జయచంద్ర, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంట కుంటలతో ప్రయోజనం

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

పంట కుంటలు రైతులకు ఎంతో మేలు చేస్తాయని గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మండలంలో జరుగుతున్న పంట కుంటలు, పండ్ల తోటల పెంపకం పనులను పరిశీలించారు, మొదటగా చింతకొమ్మదిన్నె గ్రామపంచాయతీలో రైతు పొలంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కుంట పరిసర ప్రాంతాల్లో వివిధ రకాలైన మొక్కలు పెంచుకొని రైతులు లబ్ధి పొందాలని కోరారు. పథక సంచాలకులు ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ అందరూ రైతులు వారి పొలాలలో పంట కుంటలు నిర్మించుకోవాలని, రైతులు ఒక రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా మొత్తం ఉపాధి హామీ ద్వారా పంట కుంటలు చేపడతామని తెలియజేశారు, అనంతరం అశ్వర్తుగారిపల్లెలో సుబ్బరామిరెడ్డి పొలంలో జరుగుతున్న పంట కుంటను పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో కమలాపురం ఎపిడి సోమశేఖర్‌రెడ్డి, చింతకొమ్మదిన్నె ఎపిఒ రామంజుల రెడ్డి, ఇసి అన్నానాయక్, సాంకేతిక సహాయకులు మహబూబ్ అలీ, రాజారెడ్డి, క్షేత్ర సహాయకులు కులాయమ్మ పాల్గొన్నారు.



జాయింట్ కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్ : మేయర్

ప్రజాశక్తి- కడప అర్బన్

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అందరికీ ఆమోదమైన బడ్జెట్‌ను రూపకల్పన చేశామని మేయర్, స్టాండింగ్ కమిటీ చైర్మన్ సురేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం మేయర్ ఛాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కమిషనర్ మనోజ్‌రెడ్డి హాజరయ్యారు. బడ్జెట్‌కు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 2024-25, 2023-24 బడ్జెట్‌ల సవరణలోని అంతిమ విలువల ఆధారంగా ప్రస్తుతం రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ప్రతి సంవత్సరమూ వచ్చే గ్రాంటులను, నష్టపరిహారాలను అంచనా వేశామని తెలిపారు. ఖర్చుల విషయంలో కూడా రాబోవు ఏడాదికి తగిన విధంగా అంచనా వేసి బడ్జెట్ ను రూపొందించినట్లు చెప్పారు. 2024-25 సంవత్సరపు సవరించిన బడ్జెట్ సాధారణ మూలధన అంత్య విలువ రూ.6718.70 లక్షలు గాను, 2025-26 సంవత్సరం బడ్జెట్ ప్రారంభనిల్వగా చూపి, అన్ని ఖాతా పద్దుల కింద సాధారణ, మూలధనాల రాబడి ప్రారంభ నిల్వతో సహా రూ.51484.31 లక్షల రాబడి, మొత్తం ఖర్చు రూ.44728.57 లక్షలు గాను మిగులు నిల్వ రూ. 6755.74 లక్షలుగా అంచనా వేసినట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు కేటాయించిన మొత్తాల్లో ప్రభుత్వ ఉత్తర్వుల ననుసరించి షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, వికలాంగులు, స్త్రీ శిశు సంక్షేమం కోసం కేటాయించిన మొత్తాలు వారి సంక్షేమ పనుల కోసం ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. నికర నిధులలో ఖర్చు 40 శాతం నిధులను మురికివాడలలో అభివృద్ధి పనులకు వెచ్చించవలసినదిగా ఇంజినీరింగ్ శాఖకు సూచించామని తెలిపారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు సమ్మెట వాణి, మక్బూల్ బాష, బాలస్వామి రెడ్డి, కె.బాబు, నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఎగ్జామినేషన్ ఆఫ్ అకౌంట్స్ ఆఫీసర్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరోగమనం

ప్రజా'దృష్టి'

అభివృద్ధి పేరుతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు కూల్చివేతలతో ప్రసిద్ధికెక్కింది. జిల్లా ప్రగతి తిరోగమనబాట పట్టిస్తోంది. జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా నిత్యాన్నదానానికి ప్రసిద్ధి చెందిన కాశినాయన క్షేత్రంలోని పలు నిర్మాణాలు అటవీశాఖ పరిధిలో ఉందనే సాకుతో కూటమి సర్కారు కూల్చివేతలకు పాల్పడింది. రజకుల, కుమ్మరుల అన్నదాన సత్రాలను, స్నానపు గదులను, అతిథిగృహాన్ని ఇతర వసతి సదుపాయాలు అటవీశాఖ పరిధిలో ఉన్నాయనే సాకుతో కూల్చివేయడం చర్చనీయాంశంగా మారింది. మూడు నెలల కిందటి నుంచి కాశినాయనలో నిర్మాణాల వ్యవహారం చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రెండు దశాబ్దాల కిందటి ఫలితాల రికార్డు మార్కును టిడిపి అందుకుంది. ఇటువంటి పలితాలను అందుకున్న తర్వాత భాద్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంది. జిల్లా ప్రజానీకం అందించిన బాధ్యతలను జాగ్రత్తగా స్వీకరించాలి. టిడిపి ప్రజానీకపు అద్భుత ఆదరణను దుర్వినియోగం చేయడం స్వయం కృతాపరాదమనే చెప్పాలి. కూటమి సర్కారులో టిడిపి, జనసేన, బిజెపి ఉన్నప్పటికీ మంచి, చెడుల ప్రభావం టిడిపిపైనే ఎక్కువగా ఉంటుందనే సంగతిని గ్రహించి మసలుకోవాలి. మంత్రి నారా లోకేష్ నష్టనివారణకు చర్యలకు దిగినప్పటికి జరగాల్సిన నష్టం జరిగిపోయిందనే చెప్పాలి. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పరిధిలోని ఫారెస్ట్‌శాఖ చేపట్టిన కూల్చివేతలకు పవన్‌కల్యాణ్ స్పందించి ఉండాల్సి ఉంది. ఫారెస్ట్ మినిస్టర్ శాఖ పరిధిలో దొర్లిన అపశృతిని సంబంధిత మంత్రి పవన్‌కల్యాణ్ ద్వారా నష్టనివారణ చర్యలు చేపట్టి ఉండాల్సి ఉంది. కూటమి సర్కారు తీసుకున్న కూల్చివేతలపై విద్యా శాఖా మంత్రి క్షమాపణలు కోరడం, తన సొంత సొమ్ముతో కట్టడాలను పునరుద్ధరిస్తామని చెప్పడం ఏమిటనే వాదన వినిపిస్తోంది. ఇది డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌పై రాజకీయంగా పైచేయి సాధించినట్లు అవుతుందనే విశ్లేషణలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో ఎనిమిదింటిని కూటమికి అందించింది. కూటమి పెద్దలు బృహత్తర విజయాన్ని వినమ్రంగా స్వీకరించాలి. అనంతరం ప్రభుత్వ పాలనా బాధ్యతలను జాగరూకతతో నిర్వహించాలి. సుమారు నాలుగు దశాబ్దాల పాలనానుభవం కలిగిన సీనియర్ నాయకులు చంద్రబాబు నాయుడు హయాంలో ఉండవల్లి ప్రజావేదిక కూల్చివేతను తలపించే తరహా నిర్ణయం తీసుకోవడం ఏమిటనే వాదన వినిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా ప్రజానీకం కూటమి పార్టీలకు అందించిన అద్భుత ఫలితాలను సైతం రెండు చేతులా స్వీకరించలేని అసమర్థ నిర్వాకం నేపథ్యంలోనే కూల్చివేతలు చోటుచేసుకున్నాయనే విశ్లేషణ వినిపిస్తోంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న పశు వైద్య విద్యార్థులు

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రూరల్ పరిధిలోని గోపవరం పంచాయతీ పశువైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసిస్తున్న జూనియర్ డాక్టర్లు స్టయిఫండ్ పెంచాలంటూ చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 41వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెటర్నరీ జూనియర్ డాక్టర్లకు తమ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా నెలకి కేవలం రూ.7,000లు మాత్రమే స్టయిఫండ్ వస్తుందని, పెరుగుతున్న అద్దెలు, సరుకుల ధరలను బట్టి ఇది కనీస అవసరాలకు కూడా సరిపోవడంలేదన్నారు. ఎంబిబిఎస్, హోమియోపతి వంటి ఇతర వైద్య విద్యా కోర్సుల్లో ఉన్న జూనియర్ డాక్టర్లకు నెలకు రూ.25,000 వరకు స్టయిఫండ్ వస్తుందని, వెటర్నరీ జూనియర్ డాక్టర్లకు ఇంత తక్కువ వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో రూ.23,000 వరకు స్టయిఫండ్ ఇస్తున్నారని, మన రాష్ట్రంలో పరిస్థితి ఇంత దారుణంగా ఉందన్నారు. పశు వైద్య విద్యార్థుల సమస్యలకు ప్రభుత్వమే పరిష్కారం చూపాలన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - ముద్దనూరు

సోమవారం జరగనున్న పదవ తరగతి పరీక్షలకు సంబంధించి విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలకు చెందిన 288 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఇఓ నాగేశ్వర నాయక్ తెలిపారు. ముద్దనూరు బాల, బాలికోన్నత, ఉప్పలూరు, రాజుల గురువాయపల్లె, యామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 217 మంది పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. నాలుగు ప్రయివేటు పాఠశాలకు సంబంధించి 71 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. ముద్దనూరు బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 141, బాలికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 147 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఇఓ వివరించారు.

ఒక్క పాఠశాల కూడా మూతపడకుండా చూస్తాం

- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గంలో ఒక్క పాఠశాలను కూడా మూత పడకుండా చూస్తామని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో శనివారం డిఇఓ, ఎంఇఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా, తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ముందుకు వెళ్తామన్నారు. అవసరమైతే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ప్రాథమిక విద్యా విధానం గందరగోళానికి గురైందని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త విధానంలో ఐదు రకాల పాఠశాలలు శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్, బేసిక్ ప్రైమరీ స్కూల్, మోడల్ ప్రైమరీ స్కూల్ తదితర వాటి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎంఇఓలు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటిలో యంగ్ ఇంజినీర్స్ సెమినార్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ (ఎస్ఆర్ఐటి) కళాశాలలో శనివారం ఇండస్ట్రీ ఎక్స్‌పెక్టేషన్స్ ఫ్రొం యంగ్ ఇంజినీర్స్ అనే అంశంపై వర్కుషాప్ సెమినార్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా (గ్రూప్-టిసిఎస్ బెంగళూరు) శ్రీనివాస రామానుజన్ బి.టెక్ రెండవ సంవత్సరం వారికి సెమినార్ నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీనివాస రామానుజన్ మాట్లాడుతూ భారత దేశంలో యువ ఇంజినీర్స్ బలమైన సాంకేతిక నైపుణ్యాలు, సమర్థవంతమైన కమ్యూనికేషన్స్, సమస్య పరిష్కార సామర్థ్యాలు కలిగి ఉండాలన్నారు. నేర్చుకోవడానికి, స్వీకరించడానికి ఇష్టపడటాన్నారు. అదే సమయంలో జట్టు కృషిని, నాయకత్వ సామర్థ్యాన్ని కూడా కలిగి ఉండాలని నేటి పరిశ్రమ కోరుకుంటోందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పాంగ్రంగాన్ రవి, ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరశేఖర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వర రెడ్డి, హెచ్ఒడీలు సెమినార్ లోని ముఖ్య ఉద్దేశాన్ని గుర్తు పెట్టుకుని భవిష్యత్తులో మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని కోరారు.



తాము వేసిన డ్రాయింగ్‌ను చూపుతున్న విద్యార్థులు

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనంలో ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయురాలు శివ మునెమ్మ, డ్రాయింగ్ మాస్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శని వారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ప్లాస్టిక్, పరిశుభ్రతకు సంబంధించిన అంశాలపై బొమ్మల రూపంలో విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి

ప్రజాశక్తి - వేముల : యురేనియం కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శని వారం నగదు బహుమతి అందజేసింది. యురేనియం పరిసర గ్రామాలు తుమ్మలపల్లి, మబ్బు చింతల పల్లె, భూమయ్యగారి పల్లె, రాచకుంటపల్లె, వేల్పుల, కొట్టాల, కనంపల్లె గ్రామాల్లో 2022-23 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన 14 మంది విద్యార్థులకు వారి ఉన్నత చదువు నిమిత్తం ప్రతిభ పుం`స్కారాలు జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్ అందించారు. మొదటి పుం'స్కారంగా రూ.19,200, రెండవ ప్రతిభ పుంస్కారంగా రూ.16,800 చెక్ రూ పంలో అందజేశారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్, డిజిఎం శ్రీకాంత్, డిజిఎం మతివానన్, పర్సనల్ మేనేజర్ ప్రదీప్ నాయక్, పబ్లిసిటీ సూపరింటెండెంట్ రాజేష్, సిఎస్‌ఆర్ కో-ఆర్డినేటర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థి

అంతర పంట సాగుతో అధిక ఆదాయం

చీనీ తోటలో అంతర పంటగా సొరకాయ : అభ్యుదయ యువ రైతు వెదురు సందిరెడ్డి



అంతర పంట సొర కాయలను పరిశీలిస్తున్న వెంకటకృష్ణారెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి - ముద్దనూరు

చీనీ కాయలకు పేపర్ (ఫ్రూట్) కవర్ తొడిగితే ఎండ దెబ్బ తగలకుండా కాయలు మంచి పరిమాణంతో నాణ్యత, మంచి ధర లభిస్తుందని అభ్యుదయ యువ రైతు వెదురు సందిరెడ్డి తెలిపారు. గంగాదేవి పల్లె గ్రామానికి చెందిన అభ్యుదయ యువ రైతు వెదురు సందిరెడ్డి తన 3ఎకరాల పొలంలో చీనీ చెట్లు నాటాడు. అంతర పంటగా గట్ల వెంబడి సొర పంట సాగు చేసినట్లు వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. అభ్యుదయ యువరైతు సందిరెడ్డి వ్యవసాయ రంగంలో సలహాలు మెలకువలు పాటించి ఎంతో మంది రైతులకు ఆదర్శంగా నిలిచారన్నారు. సందిరెడ్డి తన బత్తాయి తోటలో ఒక వినూత్న ఆలోచన చేసి పంట సాగు చేస్తున్నట్లు తెలిపారు. సందిరెడ్డి మాట్లాడుతూ.. చీనీ తోటలో కొన్ని చెట్లను ఎంచుకొని చీనీ కాయలకు ఫ్రూట్ కవర్ తొడిగినట్లు చెప్పారు. ఇలా చేయడం వల్ల కాయ పరిమాణం, రంగుతేలి, నాణ్యత, రుచి బాగా ఉంటుందన్నారు. చీడపీడలు సోకకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయన్నారు. మార్కెట్లో మంచి ధర పలుకు తుందన్నారు. చీనీ తోటలో గట్ల వెంబడి నేలను ఖాళీగా, వృథా చేయకుండా కొత్త ఆలోచన చేసి అంతర పంటగా గట్ల వెంబడి



ఇంగ్లాండ్ రకం సొర విత్తనాలు నాటి మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్నట్లు తెలిపారు. కేవలం 50 రోజుల్లో సొర కాయలు కోతకు వస్తుందన్నారు. మొదటిసారి కోతలో 50-70 కాయలు చొప్పున కాయలు కోసి మార్కెట్‌కు హోల్‌సేల్ ధరకు అమ్ముతున్నట్లు తెలిపారు. ప్రతి రెండు దినాలకు ఒకసారి 150 నుండి 200 కాయల వరకు ఒక్కో కాయ రూ.4ప్రకారం మార్కెట్లో వ్యాపారస్తులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. సరాసరి రోజుకు రూ.600-రూ.800 వరకు ఆదాయం వస్తుందన్నారు. పొలం వృథా కాకుండా అంతర పంటగా పెట్టుకోవడం వల్ల తక్కువ ఖర్చు, శ్రమతో తొందరగా ఆదాయం వస్తుందన్నారు. వచ్చే ఆదాయంతో ప్రధాన పంట అయిన చీనీ తోటకు పెట్టుబడికి అవసరమైన ఖర్చులకు ఉపయోగ పడుతుందన్నారు. ఇప్పటికి సొర అంతర పంటగా సాగు చేసినందుకు రూ.1,000 ఖర్చు అయిందన్నారు. తదుపరి మార్కెట్లో రోజువారీ కాయలను అమ్మగా రూ.600 నుండి రూ.800 ఆదాయం వస్తుందన్నారు. రైతులు కొత్త ఆలోచనలతో పంటలు సాగు చేస్తే వ్యవసాయంలో మనుగడ సాధ్యమన్నారు.

స్వచ్ఛత, శుభ్రత జీవన విధానం కావాలి



రోడ్లు శుభ్రపరుస్తున్న ఎమ్మెల్సీ, మున్సిపల్ ఛైర్మన్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్వచ్ఛత, శుభ్రత ప్రజల జీవన విధానం కావాలని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. 'స్వచ్ఛ ఆంధ్రా.. స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. రాంగోపాల్ రెడ్డి, పులివెందుల మున్సిపాలిటీ ఛైర్మన్ డాక్టర్ వి.వరప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం ఆపేద్దాం మన భూమిని కాపాడుదాం, స్వచ్ఛమైన దేశం ఆరోగ్యవంతమైన దేశం, పర్యావరణాన్ని రక్షిద్దాం, ప్రాణకోటిని కాపాడదాం అని పిలుపునిచ్చారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, స్వచ్ఛతను కాపాడడం మన అందరి బాధ్యత అన్నారు. ఎమ్మెల్సీ, మున్సిపల్ ఛైర్మన్ స్వయంగా చీపురు పట్టి రోడ్లను శుభ్రం చేసి, స్వచ్ఛతలో తాము కూడా భాగమనే సందేశాన్ని నింపారు. ప్రతి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ వైస్ ఛైర్మన్ హఫీజ్, పులివెందుల మున్సిపల్ కమిషనర్ రాముడు, పులివెందుల అర్బన్ సీఐ నరసింహులు, ఎస్ఐ విష్ణు నారాయణ టిడిపి నాయకులు మైసూరారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి (బాబురెడ్డి) బిజెపి నాయకులు భాను ప్రకాష్, జ్ఞానేశ్వర్ నాయుడు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఖాజీపేట : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తడిపొడి చెత్త ద్వారా సంపద పొందవచ్చునని సర్పంచ్ కొంగాని వెంకటసుబ్బయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని భూమాయపల్లె పంచాయితీలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసులు చెత్త సేకరణ, తడిపొడి చెత్త ద్వారా సంపద గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ, ఆరోగ్య అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరు : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బోనం సరళ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ముద్దనూరు సర్పంచ్ బోనం సరళ,ఈఓపిఆర్డీ వీర భద్రుడు ఆధ్వర్యంలో కార్యదర్శి లక్ష్మీ నరసింహులు పరిసరాల పరిశుభ్రతపై అంగన్వాడీ కార్యకర్తలు,డ్వాక్రా మహిళలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ కూడలిలో మానవహారంగా ప్రతిజ్ఞ చేశారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఎపిఎం అపర్ణ,వెలుగు సిసిలు ఇబ్రహీం, రామాంజ నేయ రెడ్డి,దస్తగిరి, సచివాలయం ఉద్యోగులు ఆకాంక్ష, శివజ్యోతి, తేజస్విని, వరలక్ష్మి, పాలకమండలి సభ్యులు,వెలుగు ఆనిమేటర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పట్టణంలోని టిబి రోడ్డులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర అంశానికి సంబంధించి ప్రతినెల మూడవ శనివారం ఒక థీమ్ ఇస్తారని ఈ నెలకు చెంది ప్లాస్టిక్ వాడకం నివారించాలన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపి ఈ మేరకు ప్రతిజ్ఞ చేయించారు. మన రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్ర గా స్వర్ణ ఆంధ్రగా తీర్చి దిద్దుతాం అన్నారు .పరిసర ప్రాంతాలను శుభ్రంచేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ సుబ్బారెడ్డి ఆశాలు,%ఎ% సిబ్బంది పాల్గొన్నారు.

వేముల : స్థానిక ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, తహశీల్దార్ ఇందిరారాణి, ప్రాజెక్ట్ మేనేజర్ ఆంజనేయులు, డ్వాక్రా మహిళలతో స్వచ్ఛతహి సేవ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఇఓపిఆర్‌డి పద్మావతి, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు జ్యోతి, జైపాల్, హరికృష్ణ, గంగరాజు, నాగేశ్వరి, పంచాయతీ కార్యదర్శి అల్లూరయ్య, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్య క్రమంలో భాగంగా శనివారం కామనూరు పిహెచ్‌సిలో పరిసరాలను శుభ్రం చేసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి హనీఫ్ బాబా మాట్లాడుతూ ఒక సారి వాడి పడేసె ప్లాస్టిక్ వస్తువులను నిషేధించండి.. వాటికి బదులు ప్రత్యామ్నాయ వస్తువులను ప్రోత్సహించన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ కృష్ణమ్మ, సూపర్‌వైజర్స్ బిఎ వరప్రసాద్, చంద్రకళ, ఫార్మసిస్ట్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : లక్ష్మీపేటలో శనివారం స్వచ్ఛ-ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న పీడీ ఆదిశేషారెడ్డి

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ

- సమయపాలన పాటించని అధికారులు

ప్రజాశక్తి - వేముల

స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సభ అధికారుల నిర్లక్ష్యంతో మధ్యాహ్నం 2:40గంటలకు ప్రారంభమైంది. సభ ఆలస్యంతో అక్కడికి వచ్చిన ప్రజలు, ప్రజాప్రతినిధులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఉదయం నుంచి వేచి ఉండి తాగడానికి నీళ్లు కూడా లేవు. ముఖ్యఅతిథిగా పీడీ అది శేషారెడ్డి సభను ప్రారంభించారు. గత నెల 18 తేదీ నుంచి విచారణ చేపట్టిన అధికారులు పనుల్లో జరిగిన అవకతవకలను సభ ముందు ఉంచారు. స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టంట్‌లు సమాధానాలు చెప్పలేక సతమత మయ్యారు. అనంతరం వీరిపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వారికి సంబంధించిన రికార్డులను తనముందు ఉంచాలని అధికారులను ఆదేశించారు. సమావేశానికి రికార్డులతో తీసుకురాకుండా హాజరుకావడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

వేముల : స్థానికకులకే ఎస్ఎంఎస్ కంపెనీ ఉద్యోగాలివ్వాలని టిడిపి నాయకులు కోరారు. టిడిపి సానుభూతిపరులను నిర్దాక్షిణ్యంగా, చిన్నచిన్న కారణాలతో ఉద్యోగం నుండి తొలగిస్తున్న ఎస్ఎంఎస్ కంపెనీ స్థానికులకు ఉద్యోగాలు కల్పించకపోతే పులివెందుల టిడిపి తరపున యురేనియం సంస్థ వద్ద వారం రోజుల్లో సమ్మె చేపడతామని శనివారం పోలీసులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధి రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

దువ్వూరు : మండలంలోని కృష్ణంపల్లె గ్రామంలో జమాల్‌వలి ఉరుసు మహోత్సవంలో భాగంగా శనివారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దర్గాను సందర్శించి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఎడ్లచే బండలాగుడు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు టిడిపి మండల నాయకులు పాల్గొన్నారు.

వేలంలో రూ.90 లక్షల ఆదాయం

పులివెందుల రూరల్ : పులివెందుల పురపాలక సంఘానికి సంబంధించి 2025-26 ఏడాదికి దిన, వారపు సంత మార్కెట్, నిలుపబడిన వామనాలు ఫీజులు, జంతు వధశాలలకు శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. తద్వారా రూ.90,11,000ఆదాయం వచ్చినదని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ వరప్రసాద్, మునిసపల్ సిబ్బంది పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక నాగులకట్ట వీధిలోని ఎస్‌సి హాస్టల్లో డిగ్రీ విద్యార్థి అక్షయ మృతి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ ఆస్పత్రిలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతికి, టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, చేనేత కార్మిక సంఘం నాయకులు వీరనాల శివ నారాయణ, సిరివెళ్ల లక్ష్మీనారాయణ, సిపిఐ నాయకులు ప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు దాసు, ఎఐఎస్ఎఫ్ నాయకులు పీటర్, ఎంఆర్పిఎస్ నాయకులు నరసింహులు మాట్లాడుతూ స్థానిక ఎస్‌సి కాలేజి హాస్టల్‌లో విద్యార్థినుల ఆత్మహత్యల వరుస సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ప్రధాన కారణం హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యమే నని తెలిపారు. అంతే కాకుండా ఎఎస్‌డబ్ల్యూఓ గురుప్రసాద్ హాస్టల్ రెగ్యులర్ తనిఖీలు నిర్వహించకపోవడంతో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. హాస్టల్ వార్డెన్ ప్రభావతికి గురుప్రసాద్ అండదండలతోనే గతంలో నవంబర్ నెలలో ఇదే రీతిలో ఇద్దరు విద్యార్థులు హాస్టల్‌లో ఆత్మహత్యాయత్నం ప్రయత్నించిన సంఘటనలో.. వార్డెన్‌కు ఎఎస్‌డబ్ల్యుఒ పూర్తి అండదండలు ఏర్పరిచి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోనే మళ్లీ సంఘటనలు జరుగుతున్నాయన్నారు. వార్డెన్‌ను సస్పెండ్ చేయడం కాదు.. ఎఎస్‌డబ్ల్యుఒ గురు ప్రసాద్‌ను కూడా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి మాట్లాడుతూ బాధ్యులపైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రంపల్లి అజయ్, నాయకులు రమేష్, అరవింద్, దేవ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, ఉద్యోగం ఇవ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గోపాల్ దాసు ఏసుదాసు, సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్ విలేకరుల ద్వారా డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

వాలంటీర్లను కొనసాగించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వాలంటీర్లను కొనసాగించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్య నారాయణ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం నాలుగు లక్షల మందిని వాలంటీర్లను తీసుకొని వారితో పనులు చేయించిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వారిని పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు వాలంటీర్లను కొన సాగిస్తామని రూ.10,000 వేతనం ఇస్తామని బహిరంగ సభల్లో చెప్పారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు పూర్తయిందని, పనిచేస్తున్న వాలం టీర్లకు తొమ్మిది నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. వాలంటీర్లకు వెంటనే వేత నాలు ఇచ్చి వారిని కొనసాగించాలన్నారు. వాలంటీర్లను కొనసాగించాలని కోరు తూ ఈనెల 17న సోమవారం విజయవాడ అలంకార్ సెంటర్లో ధర్నా నిర్వహిం చనున్నట్లు ఆయన తెలిపారు. ధర్నాను వాలంటీర్లు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, సిఐటియు నాయకులు శీను, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పులివెందుల శిల్పారామంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్ కిషోర్ ఆధ్వర్యంలో కిషోర్ డ్యాన్స్ అకాడమీ కడప చిన్నారులచే జానపద, వెస్టర్న్ మొద లగు నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జయప్రదం చేయాలని ఆయన కోరారు.